

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

గ్రామానికో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించగా చాలాచోట్ల నిరుపయోగమయ్యాయి. తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ చేయాలనే లక్ష్యం నీరుగారుతోంది. 11లో▸



పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠం

పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమని ఐసీడీఎస్ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రెండోరోజు ఒకే దరఖాస్తు



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సీఐ

ఆసిఫాబాద్: జిల్లాలో మద్యం షాపుల కేటాయింపునకు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా రెండోరోజు శనివారం ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. ఏజెన్సీలోని జైనూర్ షాపు నంబర్–30కి దరఖాస్తు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మోసిన్ అలీ తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీటీడీవో రమాదేవి తెలిపారు. ఎంపికైన అంజలి, సాక్షి, అంజలి, జ్యోత్స్న, శిరీషను శనివారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఈనెల 7న హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి మీనారెడ్డి, విద్యాసాగర్, జీసీడీవో శకుంతల, ఏటీడీవో క్షేత్రయ్య హెచ్‌ఎం కృష్ణారావు తదితరులున్నారు.

28న బియ్యం వేలం

ఆసిఫాబాద్: జిల్లాలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 2,416.92 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి ఈ నెల 28న ఉదయం 11.00 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ వేణు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐదు మండల స్థాయి గిడ్డంగుల్లో బియ్యం నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్‌లో 241.75 క్వింటాళ్లు, సిర్పూర్ (టీ)లో 591.55, బెజ్జూర్‌లో 151, జైనూర్‌లో 117.50, కాగజ్‌నగర్‌లో 1,315.12 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో రూ.2 వేలు డీడీ చెల్లించి ఈ నెల 8నుంచి 19వరకు దరఖాస్తు ఫాంలు పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9441870520 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రెండో ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండో ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో ఏవో రఫత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని, జూలై 26న ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, సెకండ్ ఏఎన్‌ఎంలు పుణ్యవతి, సంతోషి, రజిని, కవిత, సునీత, ప్రమీల, పద్మ, జ్యోతి, మంగ, గోదావరి, విజయలక్ష్మి, భూదేవి, మీనా, తులసి, వనిత, మేఘన,, గీత, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామంలో వారంకిత్రం ఆదివాసీల ఆరాధ్య దైవం లక్ష్మీదేవర ప్రతిమలను దహనం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆదివాసీ కోలావార్ సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీల ఆత్మగౌరవం దెబ్బతినేలా ఆరాధ్య దైవాల ప్రతిమలను తగలబెట్టిన దుండగులను పట్టుకుని చట్టప్రకారం కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారుపెల్లి పోశం, కార్యదర్శి మెర్పెల్లి సదాశివ్, నాయకులు బుర్రి నీలయ్య, పారుపెల్లి నర్సింహులు, టేకం శేఖర్, బబ్బెర శంకర్, నాయిని శంకర్ తదితరులు పాల్గొన్నారు.



దోస్త్ మేరా దోస్త్..!

• నేడు స్నేహితుల దినోత్సవం

'అమ్మ' తర్వాత కమ్మనైన పదం 'స్నేహం'. ఎంతటి కష్టాల్లో ఉన్నా 'నీ కోసం నేనున్నాను..' అంటూ ఆత్మీయంగా భుజం తట్టేది మైత్రి బంధమే. ఇలా.. స్నేహబంధాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా పలువురి అభిప్రాయాలు, వివిధ కథనాలు..

స్నేహబంధం విలువైంది



ఆసిఫాబాద్: స్నేహబంధం ఎంతో విలువైంది. ఇంట్లో వారితో చెప్పుకోలేని వ్యక్తిగత విషయాలు కూడా స్నేహితులతో పంచుకోవచ్చు. స్నేహంతో బంధాలు ఎంతో బలపడతాయి. స్నేహితులతో కలిసి ఉంటే కలిగే ఆనందం వెలకట్టలేనిది. ప్రతిఫలాన్ని ఆశించని స్నేహబంధం జీవితాంతం నిలుస్తుంది.

– సురేందర్, డీఆర్డీవో, ఆసిఫాబాద్

మరువలేనిది స్నేహమొక్కటే..



ఆసిఫాబాద్: జీవితంలో మరువలేనిది స్నేహమొక్కటే. స్నేహానికి వయస్సుతో సంబంధం లేదు. బాధలను దాపరికం లేకుండా చెప్పుకొనేది స్నేహితులతోనే.. స్నేహం కన్నా గొప్పది ఈ లోకంలో ఏదీ లేదు. జీవితంలో ఆటుపోట్లు ఎదురైన సమయాల్లో తోడు నిలిచేవారే నిజమైన స్నేహితులు.

– వేణు, అదనపు కలెక్టర్

స్నేహబంధం బలపడేందుకే సేవలు



దహెగాం: ఒకరికొకరం సాయపడే మా స్నేహితులమంతా ఆపదలో ఉన్నవారికీ సాయం చేయాలని భావించాం. మా స్నేహబంధం మరింత బలపడాలని 'హెల్పింగ్ హ్యాండ్' పేరిట వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరికైనా సాయం అవసరమైతే గ్రూపులో పోస్ట్ చేయగానే మిత్రులంతా స్పందించి తోచినసాయం అందిస్తారు. 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన 'అన్న పని చేస్తేనే చెల్లెల్ల కడుపునిండేది' కథనానికి మేమూ స్పందించాం. చౌక గ్రామానికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు సాయమందించాం. ఇలాంటి సేవా కార్యక్రమాలతో మా స్నేహబంధం మరింత బలపడుతోంది.

– లోనారే సునీల్, దహెగాం



తెలంగాణ ఉద్యమంతో మొదలై..



ఆసిఫాబాద్‌అర్బన్: ఈ పాటోలో ఉన్నది కోండ్ర రాజేశ్వర్, సాంగెడ్డె జీవన్. తెలంగాణ ఉద్యమ సమయంలో గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను చైతన్యవంతులను చేసే క్రమంలో మొదలైన వీరి స్నేహం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ప్రస్తుతం వీరు బీఆర్‌ఎస్‌లో కొనసాగుతుండగా పార్టీ శ్రేణులు వీరి స్నేహబంధాన్ని గురించి గొప్పగా చెప్పుకొంటారు. 'వచ్చే జన్మలోనూ మా స్నేహం ఇలాగే కొనసాగాలి' అని మిత్రులిద్దరూ తరచూ అంటుంటారు.

ఐదు దశాబ్దాల మైత్రిబంధం



ఆసిఫాబాద్‌అర్బన్: 50 ఏళ్లుగా మైత్రిబంధం కొనసాగిస్తున్న ఈ ఫొటోలోని వారంతా ప్రస్తుతం 60 ఏళ్లు పైబడినవారే. వీరిలో వారణాసి కిషన్‌రావ్, నిమ్మకంటి రమేశ్, జయప్రకాశ్ హైదరాబాద్‌లో ఉంటుండగా, వైద్య పూర్ణచందర్‌రావ్ అమెరికాలో, విద్యాసాగర్ ఆసిఫాబాద్‌లో ఉంటున్నారు. బాల్యం నుంచి ఉద్యోగాలు చేసి రిటైర్డ్ అయ్యే దాకా వీరి స్నేహంలో ఎలాంటి మార్పు లేదు. వీరిలో ఎవరింట్లో శుభకార్యం జరిగినా అందరికీ పండగే. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వీరంతా అన్ని పనులు వదులుకుని అంతా ఒక్కచోట కలుసుకుంటారు. స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.

హోదాలు, ప్రాంతాలు వేరైనా..



ఆసిఫాబాద్‌అర్బన్: వీరిద్దరూ బాల్యంలో కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ కాలనీలో నివాసముండేవారు. వీరి తండ్రులు సర్‌సిల్క్‌లో అతి తక్కువ వేతనంతో పని చేసేవారు. చాలా కష్టపడి ఉన్నత చదువులు చదివారు. ప్రస్తుతం రాంబాబు అమెరికాలో ఓ కంపెనీకి మేనేజర్‌గా పని చేస్తున్నారు. సురేశ్ కుమార్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వెటర్నరీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. బాల్యంలో చిగురించిన వీరి స్నేహం ఇప్పటికీ అలాగే ఉంది. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికి ఒకరు తోడుంటారు. కలిసే సమస్య పరిష్కరించుకుంటారు. హోదాలు, ఉంటున్న ప్రాంతాలు వేరైనా వీరి స్నేహంలో ఎలాంటి మార్పు లేదు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

• అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న దీపక్ తివారి

ఆసిఫాబాద్: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలోని అన్ని విభాగాలు, రికార్డులు, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉంటూ విధుల్లో సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, డంప్‌యార్డు, వైకుంఠధామాలను పరిశీలించారు. నిత్యం ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంప్‌యార్డుకు తరలించాలని సూచించారు. అనంతరం బంబార, నవేగూడ గ్రామపంచాయతీ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామాల్లో క్లోరినేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటిని అందించాలని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఖైదీలకు సంబంధించి నమోదవుతున్న వివిధ కేసులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ సూచించారు. శనివారం జిల్లా కోర్టులోని తన కార్యాలయంలో 'ఖైదీల విచారణ కమిటీ' సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పెండింగ్ కేసులకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 41 ఏ సీపీసీ కింద నోటీసులు ఇచ్చిన కేసుల్లో అనుమానితులను వ్యక్తిగత పూచీకత్తుపై వదులుతున్నప్పుడు వారి ప్రవర్తన అంచనా వేయాలని సూచించారు. ఎస్సీ డబ్ల్యూ కేసుల్లో నిందితులు రానిపక్షంలో జమానత్ దారుకు నోటీసులు ఇవ్వాలని పేర్కొన్నారు. సీపీసీ 82 కింద ఉన్నవారికి సంబంధించిన ఆస్తి వివరాలు రెవెన్యూశాఖ నుంచి తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నేరాల అదుపునకు ఎప్పటికప్పుడు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు రమేశ్, సురేశ్, జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి



నవేగూడలో విద్యార్థులతో మాట్లాడుతున్న దీపక్

వాంకిడి: విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. మండలంలోని బంబార, నవేగూడ, జైత్‌పూర్ గ్రామాలను శనివారం ఆయన పర్యటించారు. పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు. నవేగూడ గ్రామంలోని పాఠశాలలో చేపట్టిన 'మన ఊరు –మన బడి' పనులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి నైపుణ్యాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం జైత్‌పూర్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సేంద్రియ ఎరువులు తయారు చేసి హరితహారంలో నాటిన మొక్కలకు వాడాలని సూచించారు. అనంతరం బంబార గ్రామంలో పర్యటించి వీధులను పరిశీలించారు. వర్షాలతో వాతావరణంలో మార్పులు ఏర్పాడతాయని, గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిల్వ నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో శివకుమార్, ఏపీవో శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలని వినతి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయ ఏవో రఫత్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ మాట్లాడారు. యువత పోరాడి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో పదేళ్లవుతున్నా ఉద్యోగ నియామకాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే నిరుద్యోగ యువకుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వాంకిడి మండలాధ్యక్షుడు వికాస్, ఉపాధ్యక్షులు కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
• పంచాయతీ భవనం ప్రారంభం



గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మోతుగూడ గ్రామంలో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. మోతుగూడ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు. ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ రమేశ్, సర్పంచ్ సువర్ణ, ఉపసర్పంచ్ రజిత, వార్డు సభ్యులు నగేశ్, రమేశ్, సులోచన, కార్యదర్శి రాందాస్, నాయకులు వినోద్, పాలక్‌రావు, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ తీరును నిరసిస్తూ ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ విలీనంపై పంపిన బిల్లును ఆమోదించకుండా గవర్నర్ తమిళిసై ఆలస్యం చేస్తున్నారని శనివారం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని డిపో కార్యాలయం ఎదుట ఉదయం 6నుంచి 8గంటల వరకు కార్మికులు ధర్నా చేశారు. బస్సులను బయటకు రానీయలేదు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వంలోకి ఆర్టీసీ విలీన నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దీనికి వెనక్కి తగ్గకుండా అమలు పర్చాలని కోరారు. విలీన బిల్లు, ఆర్టీసీ కార్మికుల రెగ్యులరైజేషన్ విధానాన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బూసి బాపు, ఆర్పీ సింగ్, వెంకన్న, సీహెచ్‌ఎస్ రెడ్డి, ముత్తన్న, రవీందర్, ప్రేమ్‌సింగ్, నాగభూషణం, దేవేంద్రకుమార్, సంధ్య, మంజుల, ప్రేమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాక్ష్యాధారాలతోనే నిందితులకు శిక్ష

• జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు
• టైగర్‌జోన్ పరిధిలోని అధికారులకు సెక్షన్లు, చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

జన్నారం: కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలు సకాలంలో అందించినప్పుడే నిందితులకు సరైన శిక్ష పడుతుందని జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలోని కమ్యూనిటీ హాలులో టైగర్ జోన్ పరిధిలోని జన్నారం, మంచిర్యాల, చెన్నూరు, ఆసిఫాబాద్, బెల్లంపల్లి అటవీ డివిజన్ అధికారులకు అటవీ సెక్షన్లు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్‌రావుతోపాటు సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా లీగల్‌సెల్ కార్యదర్శి ఉదయ్‌కుమార్, లక్సెట్టిపేట జూనియర్ సివిల్ న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా షరీఫ్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ హాజరయ్యారు. ముందుగా సుప్రీంకోర్టు న్యాయవాది ప్రవీణ్‌భార్గవ్ జూమ్ ద్వారా అటవీ చట్టాలపై వివరించారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ కేసులు నమోదు చేసినప్పుడు సాక్ష్యాలను తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని, సాక్ష్యాలు బలంగా ఉన్నప్పుడే నిందితులకు శిక్ష పడుతుందని తెలిపారు. అటవీ చట్టాలపై అవగాహన లేకపోతే నేరస్తులు తప్పించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. టైగర్‌జోన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలు ఉల్లంఘించకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో అటవీ చట్టాలపై అవగాహన కల్పిస్తే ప్రజలు నేరాలు చేయకుండా ఉంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఎఫ్‌డీవో వినయ్‌కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో వేణుబాబు, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, జన్నారం పరిధిలోని రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, సుభాష్, రత్నాకర్‌రావు, అనిత, రవి, మంచిర్యాల, లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, సురేందర్, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.